మట్టికుండ.. చల్లగుండ

- వేసవి వేళ కుండలకు పెరిగిన గిరాకీ
- ఆరోగ్యానికీ మంచిదంటున్న వైద్యులు

సూర్యభగవానుడు ప్రతాపాన్ని చూపిస్తూ విజృంభిస్తున్న వేళ .. గొంతు పొడిబారుతున్న తరుణంలో అమృత భాండంలా ఆదుకుంటోంది మట్టికుండ. మండుటెండలో సాంత్వన చేకూరుస్తున్నది ఈ కుండలోని నీరే. ఈ నీరే ఆరోగ్యానికీ మంచిదని వైద్యులు చెబుతున్నారు. వేలు పోసి కొన్న రిఫ్రిజిరేటర్ కంటే పేదవాడి ఫ్రిజ్‌గా పిలిచే ఈ కుండకే డిమాండ్ ఎక్కువగా ఉంటోంది.


మార్కెట్లో అమర్చిన మట్టి కుండలు


మినరల్ వాటర్‌ను మట్టి కుండ ద్వారా ఇలా..

డాబాగార్డెన్స్: ఎండల తీవ్రత పెరుగుతుండడంతో మట్టి కుండలకు గిరాకీ పెరిగింది. నగరంలోని అల్లిపురం కుమ్మరవీధి, మెయిన్‌రోడ్డు విశ్వేశ్వరాలయం ఎదురుగా గల కుమ్మరవీధి, పూర్ణామార్కెట్ తదితర ప్రాంతాలు మట్టికుండల అమ్మకాలకు కేంద్రంగా నిలుస్తున్నాయి. ఎండలు రోజురోజుకూ పెరుగుతుండడంతో, వేలు ఖర్చు చేసి ఫ్రిజ్‌లు కొనలేని పేదలు, మధ్యతరగతి వారు మట్టికుండల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఫ్రిజ్‌లోని నీరు కంటే మట్టి కుండలోని నీరే ఆరోగ్యానికి మంచిదని చెబుతుండడంతో ఫ్రిజ్‌లు ఉన్నవారు సైతం మట్టి కుండల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు.

రోజుకు ఒక్కో కుటుంబం 25 కుండలు తయారు చేసి ఒక్కో కుండను రూ.120 నుంచి రూ.140 వరకు హోల్‌సేల్ ధరలకు విక్రయిస్తున్నారు. తొలివారం వరకు రోజుకు 20 నుంచి 30 లోపే కుండల అమ్మకాలు జరగ్గా, ఈ నెల 5వ తేదీ నుంచి రోజుకు సుమారుగా 50 వరకు మట్టి కుండల విక్రయలు జరుగుతుండడం విశేషం. వచ్చే నెలలో అమ్మకాలు మరింత పెరిగే అవకాశముందని అమ్మకందారులు చెబుతున్నారు. కుండ సైజును బట్టి ఒక్కోటి రూ.100 నుంచి రూ.300కు విక్రయిస్తున్నారు. దీంతో కుండల తయారీదారులు, విక్రయదారులు తమ ఆదాయం మరింత మెరుగుపడతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


మట్టి కుండను పరిశీలిస్తున్న కొనుగోలుదారు

వ్యాపారం కొంత పర్వాలేదు..



గతంలో జనవరి నెల నుంచే కుండల తయారీ పెద్ద ఎత్తున ఉండేది. ఏడాదిలో మూడు నెలలు సీజన్ కాగా మిగిలిన తొమ్మిది నెలలు ఉపాధి వెదుక్కోవాల్సిందే. వేసవి కాలం మూడు నెలలు వ్యాపారం బాగుంటుంది. ఇళ్లల్లో ఫ్రిజ్‌లు ఉన్నవారు కూడా మట్టి కుండలు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడు పల్లెల్లోనూ ఫ్రిజ్‌లు, కూలింగ్ క్యాన్లు వాడుతుండడంతో కుండల వ్యాపారం కొంత తగ్గినప్పటికీ మట్టి కుండల్లో నీరు తాగడం శ్రేయస్కరమన్న ఉద్దేశంతో మట్టికుండలు కొనుగోలు చేస్తున్నారు. కొంత వరకు పర్వాలేదు.

– నాని, మట్టి కుండల విక్రయదారుడు, కుమ్మరవీధి, 30వ వార్డు

పేదల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యం


13వ వార్డులో యువతికి కరపత్రం అందిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఆరిలోవ: రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త అక్కరమాని విజయ నిర్మల తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డు శ్రీకాంత్‌నగర్‌లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత, ఆ పార్టీ నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి మహిళలు, వృద్ధులు, యువకులను కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఎలాంటి లబ్ధి పొందారో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వారితో మాట్లాడి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్, సచివాలయ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. ఎలాంటి సమస్య అయినా వారి దృష్టికి తీసుకెళ్లాలని ఆమె సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధి పొంది ఆర్థిక అభ్యున్నతి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కెల్ల సత్యనారాయణ, శిరీష, దుర్గారావు, బేగం, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెగా పీపుల్స్ సర్వేకు ప్రజాదరణ


ముఖ్యమంత్రిని కలిసిన హర్షవర్ధన్ రెడ్డి

ఏయూక్యాంపస్: మెగా పీపుల్స్ సర్వేకు ప్రజాదరణ పెరుగుతోందని జగనన్న సచివాలయం, గృహసారథి ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో కలిసి ఉత్తరాంధ్ర జిల్లాల వివరాలు వివరించారు. తొమ్మిది రోజులుగా చేపడుతున్న జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్‌కు ప్రజాస్పందన పెరుగుతోందని వివరించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు ప్రజలు స్వాగతం పలుకుతున్నారని ముఖ్యమంత్రికి వివరించారు.

జీవీఎంసీ కమిషనర్ దృష్టికి 15వ వార్డు సమస్యలు


జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గిరిబాబు

మద్దిలపాలెం: జీవీఎంసీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సాయికాంత్ వర్మను 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు అప్పారి గిరిబాబు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి పరిచయం చేసుకున్నారు. వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. ప్రధాన సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, వెంకటలక్ష్మి, నరాల సత్తిబాబు, బుగత యేసురత్నం, గొలగాని త్రినాథ్ పాల్గొన్నారు.

21 నుంచి ఆస్కార్ అవార్డు చిత్రాల ప్రదర్శన

మద్దిలపాలెం: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకూ ఆస్కార్ అవార్డు పొందిన చిత్రాల ప్రదర్శించనున్నామని నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో సాయంత్రం 6 గంటల నుంచి ఈ చిత్రాల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఆస్కార్ అవార్డు పొందిన ఎలిఫెంట్ విస్పర్స్ చిత్రాన్ని 21న, 22న ఎవ్రీథింగ్ ఎవ్రీ వేర్ ఆల్ ఎ.టీ.వన్స్, 23న ది వెల్ చిత్రాన్ని ప్రదర్శించనున్నామన్నారు. ఆస్కార్ సాధించిన నాటు నాటు పాటను కూడా ప్రదర్శించనున్నామని పేర్కొన్నారు. అందరూ ఆహ్వానితులేనన్నారు.

తల్లీబిడ్డల అదృశ్యం

ఆరిలోవ: ఓ తల్లీ ఇద్దరు కుమారులతో అదృశ్యమైన ఘటనపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎండాడలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఎలమంచిలి సూర్య కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అతని భార్య దివ్య(29), కుమారులు నిర్భాయి(10), నిర్దేశ్(9) ఈ నెల 4న సాయంత్రం 4 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులను సంప్రదించినా ఆచూకీ లభించలేదు. దీంతో సూర్య మంగళవారం ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన 10వ తరగతి పరీక్షలు

విశాఖ విద్య: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి. చివరి రోజైన మంగళవారం ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు జరిగిన పరీక్షకు 1,023 మంది నమోదు చేసుకోగా.. 948 మంది హాజరయ్యారు. 92.7 శాతం హాజరు నమోదైనట్లు డీఈవో చంద్రకళ తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ ఆలయ వార్షిక జాతరలో భాగంగా నిర్వహించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అలరించాయి. మంగళవారం సాయంత్రం శ్రీనృత్య నికేతన్ విద్యార్థినులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం ఆకట్టుకున్నాయి. శ్రీవరాహ నరసింహ భజన మండలి మహిళా సభ్యులు కోలాటంతో అలరించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ సాంస్కృతిక కార్యక్రమాలను సమన్వయం చేశారు. ఆలయ ఈవో డి.వి.సురేష్‌బాబా కళాకారులకు కృతజ్ఞతలు తెలిపి, అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.


నృత్యం ప్రదర్శించిన చిన్నారులతో పోలమాంబ ఆలయ కమిటీ సభ్యులు

రిజిస్ట్రార్‌కు పుస్తకం బహూకరణ


రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌కు పుస్తకం బహూకరిస్తున్న సులేమాన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగ గౌరవ ఆచార్యులు, ఏయూ పూర్వ విద్యార్థి డాక్టర్ షేక్ సులేమాన్ రచించిన బిల్డింగ్ పర్సనాలిటీ అండ్ ఎంప్లాయబులిటీ స్కిల్స్ పుస్తకాన్ని మంగళవారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌కు బహూకరించారు. విద్యార్థుల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవడానికి, అవసరమైన నైపుణ్యాలను వివరిస్తూ ఈ పుస్తకాన్ని రచించినట్టు సులేమాన్ తెలిపారు. ఏయూ బీపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీ వ్యూ పాయింట్ సందర్శన

ఆరిలోవ: విశాలాక్షినగర్ దరి బీచ్‌రోడ్డులో వైఎస్సార్ సీ వ్యూ పాయింట్(సీతకొండ)ను మంగళవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సందర్శించారు. ఇటీవల నగరంలో జరిగిన జీ–20 సదస్సులో భాగంగా ఇక్కడ సీ వ్యూ పాయింట్‌ను అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్శనలో భాగంగా ఇక్కడ ఐ లవ్ వైజాగ్ బోర్డు, సోలార్ ట్రీ, చిత్రలేఖనాలు, ఫుట్‌పాత్‌లను పరిశీలించారు. ఐ లవ్ వైజాగ్ బోర్డును ఆకతాయిలు శిథిలం చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యవేక్షణ ఉండాలని, అలాంటివారిపై దృష్టి పెట్టాలని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మిని ఆదేశించారు. జరిగిన అభివృద్ధిని కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.


సీ వ్యూ పాయింట్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రితో అవస్థలు



రోడ్డుపై ఉన్న భవన నిర్మాణ సామగ్రి

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు పరిధిలోని దసపల్లా హిల్స్ రోడ్డులో యథేచ్ఛగా భవన నిర్మాణ సామగ్రి నిల్వ చేస్తున్నారు. రోజుల తరబడి ఈ సామగ్రిని తీయకపోవడంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దసపల్లా హిల్స్‌కు ప్రముఖులు నివాసం ఉండే ప్రాంతంగా పేరొందింది. అంతే కాకుండా ఈ రోడ్డు మీదుగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పుడు ఈ రోడ్డును ఆనుకుని నాలుగు భవనాల నిర్మాణం చేపడుతున్నారు. వాటికి సంబంధించిన ఇసుక, ఐరన్, కాంక్రీట్, తదితర సామగ్రిని రోడ్డుపైనే నిల్వ చేస్తున్నారు. దీంతో వాహనచోదకుల రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. మరో వైపు భారీ వాహనాల రాకపోకలతో ఈ రోడ్డు గుంతలమయమై అధ్వానంగా తయారైంది. అయినా జీవీఎంసీ అధికారులు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రెండు రోజుల్లో తొలగించకపోతే చర్యలు

రోడ్డుపై వేసిన భవన నిర్మాణ సామగ్రిని తక్షణమే తొలగించాలని భవన యాజమానులను చెప్పాం. రెండు రోజుల్లో తొలగించకపోతే చర్యలు తీసుకుంటాం. నిర్మాణ దశలో ఉన్న భవనాలకు సంబంధించి నీరు నిలిచి రోడ్డు బురదమయంగా మారడంతో సమస్యను గుర్తించి పరిష్కరించాం.

– విశ్వనాథం, చైన్‌మెన్

జూన్‌లో నేషనల్ లెజిస్లేటర్స్ కాన్ఫరెన్స్

బీచ్ రోడ్డు: ఈ ఏడాది జూన్‌లో ముంబైలో మొట్టమొదటి నేషనల్ లెజిస్లేటర్స్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్టు కన్వీనర్ రాహుల్ తెలిపారు. కాన్ఫరెన్స్ వివరాలను ఆయన మంగళవారం విలేకరులకు తెలియజేశారు. జూన్ 15 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఈ కాన్ఫరెన్స్‌కు సంబంధించి రిజిస్ట్రేషన్స్ ప్రారంభించినట్టు తెలిపారు. భారతీయ ప్రజాస్వామ్యం, పార్లమెంట్‌ను మరింత ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లాలనేది తమ సమ్మిళిత ప్రయత్నమన్నారు. యువ రాజకీయవేత్తలను ఏ విధంగా తీర్చదిద్దగలమనే సందేహానికి ఈ కాన్ఫరెన్స్ తగిన పరిష్కారం అందించనుందన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో విభిన్న పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, సీనియర్ బ్యూరోక్రాట్లు, పౌర సమాజ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.

అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు నడక పోటీ



నడక పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

ఆరిలోవ: శ్రీకాకుళం జిల్లాలో రెండు సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగాల కోసం మంగళవారం ఇందిరా గాంధీ జూ పార్కులో అధికారులు నడక పోటీ నిర్వహించారు. ఈ ఉద్యోగాల కోసం అటవీ శాఖలో ఇప్పటికే జూనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న వాసుదేవరావు, చక్రధర్ దరఖాస్తు చేసుకున్నారు. ఈ పోస్టుల నియామకంలో భాగంగా జూ పార్కులో తెల్లవారుజామున 4 నుంచి 9 గంటల వరకు సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి ఆధ్వర్యంలో 25 కిలోమీటర్ల నడక పోటీ నిర్వహించారు. అభ్యర్థులిద్దరూ జూ లోపల రౌండ్స్ వేశారు. వారిద్దరూ గడువు కంటే కొన్ని నిమిషాలు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేరుకున్నారు. దీంతో పాటు శారీరక దృఢత్వం, మెడికల్ పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం డీఎఫ్‌వో నిషితకుమారి తెలిపారు. ఈ నడక పోటీని డీఎఫ్‌వోతో పాటు ఏసీఎఫ్ మంగమ్మ పర్యవేక్షించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ జేఏసీ అసోసియేట్ చైర్మన్ పేర్రాజు

మహారాణిపేట: జిల్లా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘాల కార్యాచరణ సమితి(అమరావతి) జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్‌జీవో హోంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ(అమరావతి) రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే చొరవ చూపి ఉద్యోగ సంఘ నాయకులతో చర్చలు జరిపి.. తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అమరావతి జేఏసీ కో–చైర్మన్, ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఆర్సీ, డీఏ ఎరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ త్రినాథరావు, ఏపీ భాషా పండితుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణమూర్తి, ఏపీ ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.ఎస్.మూర్తి, కో–ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శారదారావు, ప్రధాన కార్యదర్శి జగదీశ్వరరావు తదితర ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీజేఏసీ(అమరావతి) రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు

కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన


స్వర్ణ పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు, సిబ్బంది

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిపించిన ఈ పూజలో అమ్మవారిని 108 స్వర్ణ పుష్పాలతో అర్చించారు. పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

20న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 20న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో రమేష్‌నాయుడు తెలిపారు. రూ.1500 పూజా రుసుం చెల్లించి, దంపతులు పూజలో పాల్గొనవచ్చని తెలియజేశారు.

సబ్సిడీపై వాహనం అందజేత


లబ్ధిదారుడు గుమ్మడి పవన్‌కుమార్‌కు వాహన తాళం అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ జి.విజయ

మహారాణిపేట: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) పథకం కింద మంజూరైన వాహనాన్ని లబ్ధిదారుడు గుమ్మడి పవన్‌కుమార్‌కు అందజేశారు. మంగళవారం సిరిపురం వీఎంఆర్‌డీఏ కార్యాలయం వద్ద కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆయనకు వాహన తాళం అందించారు. ఈ వాహనం విలువ రూ.20 లక్షలు చేస్తుంది. ఇందులో రూ.12 లక్షలు సబ్సిడీ, రూ.8 లక్షలు బ్యాంకు రుణం మంజూరు చేసిందని మత్స్యశాఖ జేడీ జి.విజయ తెలిపారు.

సత్తాచాటిన ఏఎంసీ జట్లు

విశాఖ స్పోర్ట్స్ : డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ హెల్త్‌సైన్సెస్ అంతర కళాశాలల గేమ్స్ పోటీల్లో ఏఎంసీ ఫుట్‌బాల్, టెన్నిస్, బాల్‌బ్యాడ్మింటన్ జట్లు రన్నరప్‌గా నిలిచాయి. ఈ పోటీలు నెల్లూరులోని నారాయణ డెంటల్ కళాశాలలో జరిగాయి. ఫుట్‌బాల్ జట్టుకు రాహుల్, బాల్ బ్యాడ్మింటన్‌కు శంకర్, టెన్నిస్ జట్టుకు ,ఆదర్శ్ కెప్టెన్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్స్ మన్మథరావు, రాజేంద్రప్రసాద్ ఆయా జట్లను అభినందించారు.

సిరిపురంలో అగ్నిప్రమాదం


మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక శకటం

బీచ్ రోడ్డు: సిరిపురం బాలాజీనగర్‌లోని వాల్తేర్ హైట్స్ అపార్ట్‌మెంట్ 5వ అంతస్తులో ఉన్న హర్షిత శ్రీఅగ్రిఫుడ్స్ సంస్థలో మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏసీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో కార్యాలయం సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసింది. ఈ ఘటనలో ఏసీలు, కంప్యూటర్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న 'షేడ్స్ ఆఫ్ వైజాగ్'

బీచ్‌రోడ్డు: మన సాంప్రదాయాలు, సాంస్కృతిని ఛాయాచిత్రాలు చాటుతాయని హిందుస్తాన్ షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్ తెలిపారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా మంగళవారం బీచ్‌రోడ్డులోని హవామహల్‌లో షేడ్స్ ఆఫ్ వైజాగ్ పేరుతో పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, రాజుల పాలన, బ్రిటిష్ వారి ఆరాచక పాలనను చిత్రకారులు గీసిన చిత్రాల ద్వారానే చాలా వరకు తెలుసుకున్నామన్నారు. ఆర్టిస్ట్ నరేష్ మెహతా వైజాగ్‌లో వారసత్వ నిర్మాణాల రూపాలను గీసిన తీరు అద్భుతమన్నారు. ఈ ప్రదర్శన బుధ, గురువారాల్లో కూడా అందుబాటులో ఉంటుంది. కార్యక్రమంలో హవామహల్ రాజ మాత మయంక్ కుమారి దేవి తదితరులు పాల్గొన్నారు.


పెయింటింగ్స్‌ను ఎగ్జిబిషన్‌ను సందర్శించిన సందర్శకులు

ఘనంగా ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

ఆరిలోవ: తోటగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలను అలంకరించారు. విద్యార్థులు నృత్యాలు, పాటలతో అలరించారు. పాఠశాల ప్రదానోపాధ్యాయుడు వి.విశ్వనాథ, రిటైర్డ్ హెచ్‌ఎం కె.అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల చదువును గమనించి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర విభాగాల ఫుట్‌బాల్ విజేత మెకానికల్ జట్టు


మెకానికల్ జట్టు సభ్యులు

విశాఖ స్పోర్ట్స్ : ఈకోరైల్వే అంతర విభాగాల స్పోర్ట్స్ మేళాలో భాగంగా నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో మెకానికల్ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం రైల్వేఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆపరేటింగ్ జట్టుపై ఒక గోల్ తేడాతో విజయం సాధించింది. సెమీస్‌లో ఆపరేటింగ్ జట్టు టీఆర్‌డీ జట్టుపైన, మెకానికల్ జట్టు సివిల్ ఇంజినీరింగ్ జట్టుపైన విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. క్రికెట్ నాకవుట్ మ్యాచ్‌లో మెకానికల్ జట్టు 56 పరుగుల తేడాతో సిగ్నల్స్ టెలికాం జట్టుపై విజయం సాధించింది. మెకానికల్ జట్టు ఐదు వికెట్లకు 177పరుగులు చేయగా సిగ్నల్స్ టెలికాం జట్టు ఎనిమిది వికెట్లు కోల్పోయి 121 పరుగులే చేసింది.